క్లుప్తంగా

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

తెనాలిరూరల్: ఇంటర్ విద్యార్థిని అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చినరావూరుకు చెందిన 17 ఏళ్ల బండి సంగీత ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఇస్లాంపేట నుంచి తన పిన్ని కూతురు ఆదివారం వీరి ఇంటికి వచ్చింది. ఆమెను దింపి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన సంగీత కనబడకుండా పోయింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు ఆదివారం రాత్రి పొద్దుపోయాక కేసు నమోదు చేశారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

తాడికొండ: దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. వివరాల మేరకు..గత నెల 31న కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి ఎదురుగా ఉన్న గంగాల వెంకటేశ్వరరావు, కుమార్‌తో పాటు భార్య హేమలత దాడి చేయగా తనకు కాలు విరిగి ఆపరేషన్ చేసుకున్నానని బాధితుడు హనుమంతరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

9న సీపీఎం పట్టణ మహాసభలు



రేపల్లె రూరల్: సీపీఎం రేపల్లె పట్టణ 2వ మహాసభలు ఈ నెల 9వతేదిన పట్టణంలోని మైనేని సీతారామయ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహాసభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి గంగయ్యలు హాజరవుతారన్నారు. సమావేశంలో నూతన కమిటీల ఎన్నిక, భవిష్యత్ కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించుకోవటం జరుగుతుందన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసేలా కేంద్రంలోని మోదీ పాలన సాగుతుందన్నారు. కార్పొరేట్ల కోసమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ జమిలీ ఎన్నికలంటూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారన్నారు. ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు సనాతన ధర్మం పేరుతో హిందుత్వ ఎజెండాను ప్రజలపై రద్దుతూ రాజకీయ లబ్ధి పొందుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేసే అరాచకాలను వెలుగులోకి తెచ్చి ప్రజా ఉద్యమాలను చేపడతామని చెప్పారు. త్వరలో జరగనున్న సీపీఎం మహాసభలను జయప్రదం చేసేందుకు పార్టీ నాయకులు, సానుభూతిపరులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు కె.అగస్టీన్, కె.రమేష్, డానియేలు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య



రేపల్లె రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పిరాట్లంక గ్రామంలో చోటు చేసుకుంది. చోడాయపాలెం ఎస్ఐ జ్యోతి వివరాల మేరకు పిరాట్లంక గ్రామానికి చెందిన తోటా రాజేష్‌కు అదే గ్రామానికి చెందిన శివనాగులు(30)కు 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేసుకుని జీవించే రాజేష్ మద్యంకు బానిసై భార్యను చిత్రహింసలకు గురిచేస్తుండేవాడు. దీంతో మనస్తాపానికి గురైన శివనాగులు శనివారం సాయంత్రం పురుగులు తాగింది. ఇంట్లో అపస్మారక స్థితిలో పడిన ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో శివనాగులు మృతి చెందిందని పేర్కొన్నారు. మృతురాలి తల్లి కనకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలికి ఇరువురు కుమార్తెలు ఉన్నట్లు చెప్పారు.

హైందవ శంఖారావం బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: విజయవాడలో 2025 జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ కరపత్రలను ఆదివారం ఆవిష్కరించారు. సన్నాహక సమావేశం గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచారక్ విజయాదిత్య, జిల్లా కన్వీనర్ వంగా జనార్దన్ రెడ్డి, మాధవరెడ్డి, గోపికష్ణ వివిధ క్షేత్రాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరించారు.

స్ప్రేయర్ ఎంపికే కీలకం

- పంటలకు పురుగులు, తెగుళ్లు నివారణకు స్ప్రేయర్లే ముఖ్యం
- ఎంటలకు తెగుళ్లు ఎక్కువ ఆశిస్తున్న వైనం
- పిచికారీలో స్ప్రేయర్లు సరిగ్గా లేకపోతే మందులు వృథా
- స్ప్రేయర్‌ల వినియోగంపై వ్యవసాయ అధికారి సూచనలు



తైవాన్ స్ప్రేయర్



ఫుట్ స్ప్రేయర్

కొల్లిపర: ప్రస్తుతం మారిన వాతవరణ పరిస్థితుల కారణంగా పంటలకు పురుగులు, తెగుళ్ల ఆశిస్తున్నాయి. దీంతో రైతులు పంటలపై ఒకటికి రెండుసార్లు క్రిమిసంహారక మందులను పిచికారీ చేయడం పరిపాటిగా మారింది. పిచికారీ చేసేందుకు అవసరమైన స్ప్రేయర్లను సరిగ్గా ఎంపిక చేసుకోకపోతే రసాయన మందులు వృధా కావడంతో పాటు పిచికారీ చేసే వ్యక్తి శరీరంపై తీవ్ర ప్రభావం పడుతుంది. కొల్లిపర మండలంలో ప్రస్తుతం రైతులు వరి, మినుము, పసుపు, అరటి, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు చీడపీడల బెడదతో పాటు తెగుళ్ల విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వివిధ రకాల స్ప్రేయర్లకు సంబంధించి కొల్లిపర మండల వ్యసాయాధికారి కె.వెంకటరావు ఈ విధంగా వివరించారు.

తైవాన్ పవర్ స్ప్రేయర్

ఇటీవల అన్ని రకాల పంటలకు తైవాన్ పవర్ స్ప్రేయర్లతో మందులను పిచికారీ చేస్తున్నారు. దీని ఖరీదు కంపెనీలను బట్టి రూ.20 వేల వరకు ఉంటుంది. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో వెదజల్లే సామర్థ్యం దీనికి ఉంది. ఇతర వాటితో పోల్చితే దీనిలో సస్యరక్షణ మందులు మూడు వంతులు అధికంగా పోయాల్సి ఉంటుంది. రోజుకు సగటున 8 నుంచి 10 ఎకరాల్లో పిచికారీ చేయవచ్చు. దీనికి అమర్చిన బెల్ట్ ద్వారా భుజాల వెనుక సులభంగా తగిలించుకోవచ్చు. ఈ పవర్ స్ప్రేయర్ చదరపు సెంటీమీటర్‌కు 30–35 కిలోల ఒత్తిడిని కలగజేస్తుంది. ధ్వని కాలుష్యం తక్కువ. ఒకేసారి 20 అడుగుల వెడల్పుతో పిచికారీ చేయవచ్చు. మందు వేగం గంటకు 60 కి.మీ ఇంజన్ సహాయంతో గాలి అధిక ఒత్తిడితో బయటకు రావడం వలన మందును స్ప్రేయర్ నాజిల్ 150–200 మైక్రాన్ సైజుతో ఉండే చిన్న చిన్న బిందువులుగా విడగొట్టి అధిక విస్తీర్ణంలో పడేలా చేస్తుంది. నీటి బిందువులు గుండ్రంగా తిరగడం వలన ఆకుల పై భాగాన, కింది భాగాన పడతాయి. ఇంజన్ పని చేయడానికి గంటకు లీటర్ పెట్రోల్ అవసరం అవుతుంది. లీటర్ పెట్రోల్ సుమారు ఐదు ఎకరాలకు సరిపోతుంది. స్ప్రేయర్ బరువు తొమ్మిది కిలోలు ఉంటుంది. దీనిలో 20 లీటర్ల రసాయన ద్రావణం పడుతుంది. అధునాతన పవర్ స్ప్రేయర్లతో ఒక వ్యక్తి మందు ద్రావణ డబ్బాను భుజానికి తగిలించుకుంటే రెండు వైపులా ఇద్దరు వ్యక్తులు ఏక కాలంలో రసాయన మందును పిచికారీ చేసే పరిస్థితి వచ్చింది.

ఫుట్ స్ప్రేయర్

ఇది కాళ్లతో పనిచేస్తుంది. మినుము, పెసర వంటి పంటలతో పాటు కూరగాయల తోటలు, మామిడి, బత్తాయి వంటి పండ్ల తోటల్లో సస్యరక్షణ మందులను పిచికారీ చేయవచ్చు. రోజుకు రెండు ఎకరాల్లో పండ్ల తోటల్లో సగటున రోజుకు 150 చెట్లకు పిచికారీ చేయవచ్చు. ధర రూ.7 వేల లోపే ఉంటుంది. ఇత్తడితో తయారైన ఈ ఫుట్ స్ప్రేయర్‌లో ప్రధానంగా చిన్న బ్యారల్, కదిలే పిస్టన్ ఉంటుంది. బ్యారల్ అడుగు భాగానికి ప్లాస్టిక్ గొట్టం కలపబడి ఉంటుంది. రెండో చివరన ఫిల్టర్ గరాటు బిగించబడి ఒక పాత్రలోని రసాయన ద్రావణంలో మునిగి ఉంటుంది. పెడల్‌ను కాళ్లతో తొక్కినప్పుడు పిస్టన్ బ్యారల్‌లో పైకి కిందికి కదలడంతో ద్రావణం బ్యారల్ పై భాగానికి చేరి అక్కడి నుంచి గాలి గది ద్వారా రెండో గొట్టం చివర ఉన్న నాజిల్ గుండా బయటకు వెళ్తుంది. గాలి గది అమరిక వల్ల ద్రావణంపై పీడనం ఎల్లప్పుడు సమానంగా ఉంచి పిచికారీ ఒకే విధంగా ఉండటానికి తోడ్పడుతుంది. దీనిలో చదరపు సెంటీమీటర్‌కు 8 నుంచి 13 కిలోల ఒత్తిడి తీసుకురావచ్చు. అధిక ఒత్తిడి వలన ఎత్తుగా ఉన్న మామిడి చెట్లకు సులభంగా పిచికారీ చేయవచ్చు.

నాప్‌సాక్ స్ప్రేయర్



దీని బరువు తక్కువగా ఉండేందుకు పాలిథీన్‌తో తయారు చేస్తారు. స్ప్రేయర్ ట్యాంకు పరిమాణం 15–16 లీటర్లు, దీనికి ఉన్న బెల్ట్‌ల ద్వారా భుజాల వెనుక సులువుగా తగిలించుకోవచ్చు. వరి, మినుము, పసుపు వంటి పంటలకు అన్ని దశల్లో మందు పిచికారీకి ఈ స్ప్రేయర్ ఉపయోగపడుతుంది. రైతు స్వయంగా తాను ఒక్కడే మెల్లగా మందు పిచికారీ చేసుకోవచ్చు. దీని ధర రూ.5 వేల లోపే ఉంటుంది. దీనిలో చేతితో కాకుండా బ్యాటరీతో వచ్చే స్ప్రేయర్ ధర రూ.10 వేల వరకు ఉంటుంది. ట్యాంకు లోపలి భాగాన పంపు, గాలి గది, పై భాగాన ఒక రంధ్రానికి ప్లాస్టిక్ గొట్టం, రెండో చివర నాజిల్ ఉంటుంది. ట్యాంకులో అమర్చబడిన పిస్టన్ పైకి కిందకు కదలడం వలన ద్రావణంపై ఒత్తిడి ఏర్పడి రసాయనం బయటకు వెలువడుతుంది. పిస్టన్ కదిలించటానికి హ్యాండిల్ ఉంటుంది.

స్ప్రేయర్‌లపై అవగాహన కలిగి ఉండాలి



వాతావరణ మార్పుల కారణంగా పంటలకు అనేక తెగుళ్ల వస్తున్నాయి. వాటిని అరికట్టాలంటే రైతు సకాలంలో తెగుళ్లను గుర్తించి పంటలను బట్టి స్ప్రేయర్‌లను వినియోగించి తక్కువ సమయంలో నివారించాలి. రైతులు మందుల పిచికారీ సమయంలో సరైన స్ప్రేయర్‌లను ఉపయోగించకపోతే మందు, సమయం వృథా అవుతుంది. దీంతో పాటు మందు పిచికారీ చేసే వ్యక్తిపై ఎక్కువ మోతాదులో పడి అతని ఆరోగ్యం దెబ్బతింటుంది. ఒక్కొక్కసారి పిచికారీ చేసే వ్యక్తి మరణానికి కూడా దారితీస్తుంది. స్ప్రేయర్‌ల ఎంపిక విషయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి.

– కె.వెంకటరావు, ఏవో, కొల్లిపర మండలం

ఆత్మహత్యాయత్నం చేసిన ఆటోడ్రైవర్ మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన మరో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ రాజు(40) కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 29న పురుగుల మందు తాగాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

తాడికొండ: ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లాం గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. నిడుముక్కల గ్రామానికి చెందిన షేక్ గౌస్(49) ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్తున్నాడు. అమరావతి నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వెనుక నుంచి బలంగా గౌస్ ఢీకొట్టాడు. గాయపడి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా కొడుకు షేక్ రబ్బాని 108 వాహనంలో తండ్రి గౌస్‌ను జీజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. రబ్బాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

అనుబంధాలకు అద్దం భగిని హస్త భోజనం

భట్టిప్రోలు: సోదరి, సోదరుల ఆప్యాయత, అనుబంధాలకు అద్దం పట్టే సంప్రదాయం భగిని హస్త భోజనం. ఈ బృహత్తర కార్యక్రమాన్ని తరతరాలుగా హిందువులు సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. శనివారం రాత్రి నెలవంక దర్శనంతో ఈ కార్యక్రమాన్ని ఆదివారం జరుపుకొన్నారు. సోదరి ఇంటికి వెళ్లి సోదరుడు భోజనం చేయడం భగిని హస్త భోజనం సంప్రదాయం. ఈ సందర్భంగా సోదరుడు సోదరికి పసుపు, కుంకుమలు, సారె ఇవ్వడం ఆచారంగా వస్తుంది. ఈ వేడుకలు జరుపుకొన్న వారికి అపమృత్యు దోషం, సోదరి సౌభాగ్యవతిగా ఉండటం అనే ఆచారం ఆచరణలోకి వచ్చిందని పలువురు పెద్దలు తెలిపారు.

పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



తెనాలి: పట్టణానికి చెందిన పద్మశాలీ సంఘ నేత, వైకుంఠపురం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ జొన్నాదుల మహేష్, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ముత్యంశెట్టిపాలెంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఏర్పాటైన సభకు సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించగా మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండేల వెంకట్రావు, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, మహమ్మద్ ఖుద్దూష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, మహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, రాచాబత్తుని శ్రీనివాసరావు, అక్కల శ్రీరామ్, రాచాబత్తుని బ్రహ్మం, పంచుమర్తి భాస్కరరావు, నల్లమోలు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. జొన్నాదుల మహేష్‌ను ఘనంగా సత్కరించారు. సొసైటీ కార్యదర్శి కటకం వెంకటప్రసాద్ స్వాగతం పలకగా, దీవి పురుషోత్తం వందన సమర్పణ చేశారు.

కోతుల బెడద లేకుండా కార్బైడ్ గన్

- ఆటో డ్రైవర్ వినూత్న ఆవిష్కరణ
- పంటలకు, పండ్ల తోటలకు రక్షణ



గన్ ఉపయోగించే విధానం తెలియజేస్తున్న ఎండీ రఫీ

ఫిరంగిపురం: వరి, జొన్న, సజ్జ వంటి పంటలతో పాటు, జామ, డ్రాగన్ ఫ్రూట్, రేగు వంటి పండ్ల తోటలను నాశనం చేసే పందులు, కోతులు, పక్షుల బెడద లేకుండా ఉండేందుకు ఆటో డ్రైవర్ వినూత్నంగా తక్కువఖర్చుతో కూడిన కార్బైడ్ గన్‌ను తయారీ చేశాడు. కేవలం ప్లాస్టిక్ పైపులు, గ్యాస్ లైటర్, కార్బైడ్ పౌడర్ వంటి వాటితో సుమారు రూ.700ల ఖర్చుతో రైతులకు ఉపయోగపడేలా దీనిని తయారు చేయడం విశేషం. దీని ద్వారా హాని చేయని విధంగా పెద్ద శబ్దం వస్తుంది. దీంతో కోతులు, పక్షులు, పందులు వంటివి పారిపోతున్నాయని ఆటో డ్రైవర్ ఎండీ రఫీ తెలిపారు. ఇప్పటికే అడిగిన కొందరు రైతులకు దీనిని తయారు చేసి ఇచ్చానని, దానిని వాడి ఫలితం ఉండటంతో మరికొందరు తమకు కూడా తయారు చేసి ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు. యడ్లపాడు మండలంలోని సొలస గ్రామంలో ఎంపీపీ(ఏపీ)లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్.జున్నూసాహెబ్ తనను ప్రోత్సహించి, దీనిని తయారు చేసేందుకు సహకారం అందించినట్లు తెలిపారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకారిగా ఉందన్నారు.

రణగొణ ధ్వనులతో ఇక్కట్లు



వెల్లటూరు రహదారిపై ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్లు

- లంక గ్రామాల్లో నిత్యం ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు
- ధ్వనికాలుష్యంతో సతమతమవుతున్న ప్రజలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదలంక కాకుకుల డొంక కృష్ణా నదిలో ఇసుక కోసం ట్రాక్టర్లు రేయింబవళ్లు తిరుగుతుండటంతో ఆయా గ్రామ వాసులు దుమ్ము, ధూళి, ధ్వని కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రీచ్‌లో ఇసుక ఉచితంగా లభిస్తుండటంతో భట్టిప్రోలు, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు అధిక సంఖ్యలో తరలి వస్తున్నాయి. వేల సంఖ్యలో వస్తున్న ట్రాక్టర్ల రణగొణ ధ్వనులతో పాటు డీజే సౌండ్లతో పాటలు పెట్టుకుంటూ వాహనాలు నడుపుతున్నారు. ఈ ట్రాక్టర్ల రాకపోకలతో రహదారులు ఛిద్రమౌతున్నాయి. ట్రాక్టర్ల తాకిడితో కృష్ణా నదీ పరీవాహక లంక గ్రామాలైన చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాలకు చెందిన ప్రజలు రహదారిపై ప్రయాణించాలంటే భీతిల్లుతున్నారు. అధిక స్పీడుతో వచ్చే ట్రాక్టర్లతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కనీసం రహదారులపై ద్విచక్రవాహనం తప్పుకోవడానికి కూడా అవకాశం లేకపోవడంతో ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. అంతేకాక ట్రాక్టర్ల పై గోతాలు కప్పకపోవడంతో ఇసుక వెనకవచ్చే వాహనదారుల కళ్లల్లో పడుతుంది. ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో ఈ విధానం వల్ల ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో అర్థం కావడం లేదు. అధికారులు ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేయాలని లంక గ్రామాల ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

టీటీడీ పాలకవర్గంలో గిరిజనులకు చోటు కల్పించాలి

నెహ్రూనగర్: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలకవర్గంలో గిరిజనులకు చోటు కల్పించాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు పాండునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజనులకు పాలకవర్గంలో చోటు కల్పించారని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కూటమి ప్రభుత్వం కూడా గిరిజనులకు చోటు కల్పించాలని లేని పక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

దేవాలయాల్లో రజకులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి

నెహ్రూనగర్: రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో రజకులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అగ్రవర్ణ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయే తప్ప రాజ్యాధికారంలో వాటా ఇవ్వడానికి ఇష్టపడడం లేదని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రావడానికి 90శాతం రజకులు కష్టపడి పనిచేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక పదవులన్నీ డబ్బున్న అగ్రవర్ణాలకి కట్టబెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైన టీడీపీ ప్రభుత్వం కొత్త వాళ్లకి రెండు ఎమ్మెల్సీలు ఇవ్వాలని, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు అధిక ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

అత్తోటలో ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ జీవనలత, డాక్టర్ శైలభాను

అత్తోట(తెనాలి): పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్త నిర్వహణలో ఆదివారం కొల్లిపర మండల గ్రామం అత్తోట యాదవపాలెంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఒమేగా హాస్పిటల్స్, గుంటూరు ఆధ్వర్యంలో స్త్రీలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ములో గడ్డల పరీక్షలు చేశారు. తెనాలిలోని లతాస్ డయాబెటిక్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా థైరాయిడ్, డయాబెటిక్, ఆర్‌బీఎస్, హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేశారు. డాక్టర్ డి.జీవనలత, డాక్టర్ శైలభాను పరీక్షలు చేయగా, రోటరీ క్లబ్ నిర్వాహకులు ఈదర శ్రీనివాసరావు, ఈదర వెంకట పూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, మురళి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాషువానగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉమాదేవి

తెనాలి: రూరల్ మండల గ్రామం నందివెలుగు జాషువానగర్‌లో కూచిపూడి విజయబాబు మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తెనాలిలోని చదలవాడ స్కిన్ అండ్ ఐ కేర్ సెంటర్ సౌజన్యంతో ఏర్పాటైన ఉచిత కంటి వైద్య శిబిరంలో డాక్టర్ చదలవాడ ఉమాదేవి, జాషువానగర్‌లోని పిల్లలు, పెద్దలకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స, కంటి అద్దాలు, మందులు తమ వైద్యశాలలో ఉచితంగా అందజేస్తామని డాక్టర్ ఉమాదేవి చెప్పారు. కూచిపూడి విజయబాబు మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు, న్యాయవాది కూచిపూడి ప్రసాదరావు మాట్లాడుతూ జాషువానగర్‌లో వైద్య శిబిరం నిర్వహించినందుకు డాక్టర్ చదలవాడ ఉమాదేవి, సిబ్బందిని అభినందించారు. డాక్టర్ ఉమాదేవిని శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. సొసైటీ తరపున అందిస్తున్న సేవలను వివరించారు. కమిటీ సభ్యులు రాజేష్, కె.అలీస్, విజయ్‌కుమార్, ప్రభుదాస్, ప్రసూనాంబ పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలి

ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ శర్మ



న్యాయవాది దీవి దంపతులను సత్కరిస్తున్న దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు

రేపల్లె రూరల్: ఐక్యమత్యంతో బ్రాహ్మణులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్ శర్మ అన్నారు. పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న శ్రీలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 11వ కార్తిక వన సమారాధన, ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో బ్రాహ్మణులు అన్ని రంగాలలో తమదైన రీతిలో రాణిస్తున్నారన్నారు. సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సనాతన ధర్మం ప్రకారం వివాహాది కార్యక్రమాలు నిర్వహించాలని బ్రాహ్మణులకు సూచించారు. అనంతరం న్యాయవాది దీవి శ్రీనివాస హరికుమార్ దంపతులను, కలెక్టర్ కార్యాలయ చీఫ్ అకౌంటెంట్ రాచూరి రమణ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు వడ్లమూడి ఉదయ్‌ప్రసాద్, కార్యదర్శి పీఎస్‌టీ శర్మ, కోశాధికారి రొంపిచర్ల విజయసారధి, వైఖానస పరిషత్ అధ్యక్షుడు మేడూరి శ్రీనివాసదీక్షితులు, సభ్యులు సీవీ మోహనరావు, కొండవీటి అగస్త్య శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బ్రహ్మం గారి నాటక ప్రదర్శన



నాటకంలో ఓ దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి వారి భక్త బృందం బ్రహ్మం గారి నాటకం ప్రదర్శించారు. సూరపనేని శ్రీకాంత్ ఎండోమెంట్ సహకారంతో ప్రదర్శించగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ, సూరపనేని శ్రీరామచంద్రమూర్తిచౌదరి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామచంద్రమూర్తిచౌదరి, వీరబ్రహ్మేంద్ర స్వామి వారి భక్త బృందాన్ని సత్కరించారు. మహావిష్ణు, కాలజ్ఞాని, జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు కాలజ్ఞానం రూపంలో భవిష్యత్ తరాలకు ప్రపంచంలో జరగనున్న భవిష్యత్ ఘటనలను తాళపత్ర నిధి రూపంలో అందించిన వాటిలో కొన్ని ముఖ్య ఘట్టాలను బ్రహ్మం గారి నాటక రూపంలో ప్రదర్శించారు. నాటకం ప్రేక్షకులను అలరించింది.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

వేమూరు: డివైడర్‌ను ఆటో ఢీ కొన్న ఘటనలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి చెందిన ఘటన తెనాలి వైకుంఠపురం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. వేమూరు మండలం బేతాళ పురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అయిన వినోద్‌కుమార్ (31) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం ఆటోలో తెనాలి వెళ్లి వస్తుండగా వైకుంఠపురం వద్ద డివైడర్‌కు ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు తొలుత తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకునివెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడు గతంలో వలంటీర్‌గా పనిచేశాడు. వినోద్ మృతి విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆటో యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చందోలు డేవిడ్ విజయకుమార్, కోగంటి లవకుమార్, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన అధ్యక్షుడు మేరుగ చందన్ నాగ్, బొల్లిముంత ఏడుకొండలు, సర్పంచ్ సజ్జా లక్ష్మీ తిరుపతమ్మ, దున్నా మేరీసు బాబు, చాగలమర్రి శ్రీకాంత్ తదితరులు నివాళులర్పించారు.